క్లుప్తంగా

ఆదివాసీలకు గ్రైండర్ల పంపిణీ



బుట్టాయగూడెంలో పేద ఆదివాసీలకు గ్రైండర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రైండర్లను పేద ఆర్యవైశ్య కుటుంబాలకు చెందిన వారికి సోమవారం పంపిణీ చేసినట్లు అ సంఘ యువజన విభాగం ఉపాధ్యక్షుడు తాళ్లూరి ప్రసాద్ తెలిపారు. ఉప్పల కృష్ణ ప్రభాకర్, నాలం గంగారత్నం, చేబోలు చంటమ్మ అనే ముగ్గురికి మూడు గ్రైండర్లు పంపిణీ చేశామన్నారు. పేద ఆర్యవైశ్యులకు ఆర్థిక తోడ్పాటును అందించాలనే ఉద్దేశ్యంతో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అత్యం లక్ష్మణరావు, ఈసీ మెంబర్ వెచ్చ మణికంఠ, నల్లజర్ల బ్రహ్మానందం, పరకోటి బ్రహ్మయ్య, తదితర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం శ్రేణుల ధర్నా

కొయ్యలగూడెం : మండలంలో ఉపాధి హామీ కూలీల ఏడు వారాల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్లే స్లిప్పులు ఇవ్వాలని సీపీఎం శ్రేణులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఉపాధి కూలీలపై ఫీల్డ్ అసిస్టెంట్ల దౌర్జన్యం అరికట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం మాట్లాడుతూ మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమ పద్ధతిలో మస్తర్లు వేస ఉపాధి కూలీల డబ్బులు కాజేస్తున్నారన్నారు. దీనిపై స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

25న సీఆర్ఆర్ కాలేజీలో జాబ్ మేళా

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వట్లూరులో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సహకారంతో దెందులూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత రెండు వేల మందికి ఉపాధి కల్పించేందుకు సుమారు 30 కంపెనీలతో ఉదయం 09 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ బయోడేటాతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు సునీల్ 94934 82414, శ్యామ్ 89785 24022, సత్యనారాయణ 96663 22032లో సంప్రదించాలని వివరించారు.

శానిటేషన్ సిబ్బందిపై కాంట్రాక్టర్ దాడి

ఏలూరు టౌన్: నగరపాలక సంస్థ క్లీన్ ఏలూరుగా తీర్చిదిద్దేందుకు అనేక అభివృద్ధి పనులు చేస్తుండగా కొందరు వ్యక్తులు పరిసరాల పరిశుభ్రత పాటించకుండా తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. ఏలూరు మినీబైపాస్ రోడ్డు గ్రీన్‌సిటీ ప్రాంతంలో ఒక కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లో చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి కృష్ణ కాలువలో వేసేందుకు ప్రయత్నిస్తుండగా నగరపాలక సంస్థ శానిటేషన్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ ఆగ్రహంతో శానిటేషన్ సిబ్బందిపై దాడికి ప్రయత్నించారు. సిబ్బందిని కించపరిచేలా వ్యాఖ్యానించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జి గుడూరి ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కృష్ణ కాలువలో చెత్తవేయటాన్ని చూసి నిలదీశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు సూచించారు. నవజీవన్ బాల భవన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అశోక్ నగర్‌లోని కొండా పార్వతి దేవి థియోసాఫికల్ (కేపీడీటీ) ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుపదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలని సూచించారు. డీఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చని, ఈ చికిత్స నవజీవన్ బాల భవన్ సంస్థ ఏలూరు జిల్లా నూజివీడులో బోస్కో డీఎడిక్షన్ సెంటర్‌లో అందిస్తుందని, సెల్ నెంబర్ 94904 92020లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కేపీడీటీ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీఎస్ ప్రేమ్‌చంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- మంగపతిదేవిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మంగపతిదేవిపేట గ్రామంలో సోమవారం ఎంపీటీసీ తేలే శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ నూతన సచివాలయ భవనాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు వంటి ప్రభుత్వ కార్యాలయాలను నెలకొల్పి గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు అక్కడికక్కడే సేవా, సౌకర్యాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలలో మమేకమయ్యే విధంగా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రవేశపెట్టి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మండల పరిషత్తు నిధుల నుంచి మంగపతి దేవి పేట గ్రామంలో రూ.2 లక్షలతో తాగునీటి బోరు నిర్మాణం, అదేవిధంగా రూ.లక్షతో తాగునీటి పైప్‌లైన్లు చేపట్టాలని, సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి రూ.మూడు లక్షలు విడుదల చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. మండల పరిషత్‌లో మిగిలి ఉన్న నిధులను ఎంపీటీసీలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎంపీపీ గంజిమాల రామారావును ఆదేశించారు. ఈనెల 23వ తేదీ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు తాడిగడప రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, సర్పంచ్ అబ్బు త్రిమూర్తులు, గ్రామ కన్వీనర్ జక్కు గోపాలం, పార్టీ నాయకులు చిడిపి రవి, చిడిపి వెంకటరావు, చిడిపి వెంకటరమణ, పల్లి వెంకటేష్, చిడిపి వెంకటేష్, గంగుల సీతయ్య, చిక్కాల మణికంఠ, వేల్పుల అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు వారి ఆధార్ కార్డులను విద్యుత్ సర్వీస్‌లకు అనుసంధానం చేయాలని జంగారెడ్డిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ జిరాక్స్ పత్రాలను సమీప సెక్షన్ ఆఫీస్ నందు సమర్పించాలని, అలాగే వారి పూర్వీకుల పేరు మీద ఉన్న సర్వీస్ కనెక్షన్‌లను వెంటనే వారి పేరు మీదకు బదిలీ చేసేందుకు సమీపంలోని మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వినియోగదారులు తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ వెబ్ సైట్ ద్వారా వారి విద్యుత్ బిల్లులను చెల్లించే విధానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వినియోగదారులకు ఎటువంటి సందేహాలు ఉన్నా తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ కాల్ సెంటర్ నంబర్ 1912కి సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

కామవరపుకోట : విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక బుధవారం కామవరపుకోట సబ్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జంగారెడ్డిగూడెం ఈఈ పి.రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంతి న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో కామవరపుకోట సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ తమ సమస్యలతో పాటు నిర్వహణపై తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పేకాట స్థావరాలపై దాడులు

చింతలపూడి : మండలంలోని చింతలపూడి, మేడిశెట్టి వారిపాలెం, సీతానగరం గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై కె ప్రసాద్ సోమవారం తెలిపారు. దాడుల్లో 17 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.61,550 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

ఎస్పీ మేరీ ప్రశాంతి



పోలీస్ కుటుంబాలతో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: పోలీస్ శాఖలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతిచెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి హామీ ఇచ్చారు. పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన సిబ్బంది కుటుంబ సభ్యులతో సోమవారం ఆమె ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ, శాఖాపరంగా ఏదైనా ఆర్థిక ప్రయోజనాలు పెండింగ్‌లో ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉంటూ మృతిచెందిన అమరవీరుల కుటుంబాల్లోని అర్హత, ఆసక్తి గల పిల్లలకు కారుణ్య నియమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన సౌకర్యాలు, ఆర్థిక లబ్ధి, ఇతర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. సిబ్బంది కుటుంబాలకు ఇతర సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బందికి సంక్షేమ దివస్ నిర్వహిస్తున్నామని, సమస్య ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో దిశ డీఎస్పీ నున్న మురళీకృష్ణ, పోలీస్ ప్రధాన కార్యాలయ ఏఓ బీవీఎస్ఆర్‌కే నాయక్, పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు ఉన్నారు.

లలితమ్మ దరిచేర... కదంబం వికసించె



బుట్టాయగూడెం : పూసే ప్రతి పుష్పం దేవుని సన్నిధిలో చేరే అర్హత పొందలేదు. కొన్ని పుష్పాలు మాత్రమే పుట్టుకతోనే ఆ అర్హత సాధిస్తాయి. అటువంటి కోవకు చెందించే కదంబ పుష్పం. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే విరబూసే కదంబ వృక్షాలు గిరిజన ప్రాంతంలో పలు చోట్ల ఉన్నాయి. స్థానిక విద్యారోహిణీ డిజిటల్ స్కూల్ ప్రాంగణంలో ఉన్న చెట్లకు కదంబ పుష్పాలు విరబూసి కనువిందు చేస్తున్నాయి. లలితాదేవికి అత్యంత ఇష్టమైన పూలలో కదంబ పుష్పం ఒకటనేది పెద్దల మాట. సుగంధ సువాసనలు వెదజల్లే ఈ పుష్పాలు ఈ శ్రావణమాసంలో జరిగే పూజల్లో ప్రధానంగా ఉన్నాయి.

ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడు సమీపంలోగల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటిఐ)లో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో, ట్రేడ్లలో చేరేందుకు మూడో విడత అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాధికారి బి.శివయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ కోర్సుకు, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులు పూర్తి చేయడానికి ఒక ఏడాది పాటు కాలపరిమితి ఉంటుందని చెప్పారు. ఈ కోర్సులకు 10వ తరగతి ఉత్తీర్ణత చెంది ఉండాలని చెప్పారు. అలాగే వెల్డర్ కోర్స్‌కు సంబంధించి ఒక సంవత్సర కాలపరిమితి ఉంటుదని ఈ కోర్స్‌కు 8వ తరగతి ఉత్తీర్ణత చెంది ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 99590 67617 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



నినాదాలు చేస్తున్న హమాలీ, ఆటో కార్మికులు

జంగారెడ్డిగూడెం : ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని నిలుపుదల చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో సోమవారం మంచిలి రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, హమాలీ, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాల కోరారు. కార్మిక చట్టాలను అమలుకు ఈనెల 21 నుంచి 27 వరకు దేశవ్యాప్త ఆందోళనలకు ఇఫ్టూ ఆల్ ఇండియా కమిటీ పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, గురుగుంట్ల చిన్నారెడ్డి, తీయాల గణేష్, వనపర్ల నవీన్, బాలిన ధర్మరాజు, టి.బాబురావు, కె.రామలక్ష్మి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

పోలవరం రూరల్ : మండలంలోని విద్యాశాఖ కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపి, ఎంఈవో బోడామణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నాటికి సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు జారీ చేసిన సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, 2022 జనవరి నుంచి ఎంటీఎస్‌లు అమలు చేయాలని, జూలై నెల బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని, ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దిలీప్, దామోదరరావు, వెంకటేశ్వరరావు, ఎం.చందన, డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నారు పెంచుకునే ట్రేలు పంపిణీ



పొగాకు నారు ట్రేలు పంపిణీ చేస్తున్న వేలం అధికారులు

జంగారెడ్డిగూడెం : స్థానిక 1వ వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో రైతులు పొగాకు నారు పెంచుకునేందుకు ట్రేలను పంపిణీ చేశారు. వేలం అధికారి శ్రీహరి మాట్లాడుతూ రైతుల నుంచి వారికి అవసరమైన ట్రేలు ఇండెంట్ తీసుకుని ఆయా కంపెనీలకు ఆర్డర్ ఇచ్చి పొగాకు బోర్డు ద్వారా ఈ ట్రేలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒకొక్క ట్రే ఖరీదు రూ.16 అని చెప్పారు. బయట మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇండెంట్ తీసుకున్న రైతులకు సోమవారం నుంచి ట్రేల పంపిణీ కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

చింతలపూడి : ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తలపెట్టిన చలో హైదరాబాద్ మహా విశ్వరూప సభను జయప్రదం చేయాలని ఉత్తర కోస్తా జిల్లాల కన్వీనర్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు పిలుపునిచ్చారు. చింతలపూడి పట్టణంలో నియోజకవర్గ, ఎంఎస్‌పీ, ఎంపీఎఫ్, ఎంఆర్‌పీఎస్ సమావేశం చింతలపూడి నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ కన్వీనర్ జోసెఫ్ తంబి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చిన్న సుబ్బారావు మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణకు మాదిగలు కృషి చేయాలన్నారు. మహావిశ్వరూప సభకు లక్షలాదిగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు సంఘ నక్షత్ర మాదిగ, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకురాలు చౌటపల్లి విజయ మాదిగ, పోలవరం, చింతలపూడి నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి



విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న టి.వెంకటేశ్వరరావు

పోలవరం రూరల్ : విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వెంకటేశ్వరరావు అన్నారు. పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు, హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముందుగానే లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యనభ్యసించాలన్నారు. ఇంటర్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.12 వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.8 వేలు, పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఒకొక్కరికి రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.చోడమణి, కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, ప్రక్కి రవి, సోమరౌతు వెంకటేశ్వరరావు, బెజవాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పంపిణీ



సక్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం

టి.నరసాపురం : సక్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులు, మహిళలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ భూక్యా వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దాతల ఆర్థిక సహాయంతో 80 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ. కష్ట కాలంలో ఉన్న ప్రతి పేదవాడికి తమ ఫౌండేషన్ ద్వారా ఎంతో కొంత సహకారం అందిస్తున్నామన్నారు. ఫౌండేషన్ ద్వారా అతి త్వరలో మహిళలకు ఉచిత కుట్టుమెషీన్ శిక్షణ కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జరబల చందా, భూక్యా కృష్ణ, కుంజ కిరణ్, భూక్యా శ్రీనివాస్, ధరావత్ గోపాలకృష్ణ, పండు వీరభద్రుడు, భూక్యా సత్తిబాబు, ధరావత్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలంపాలెంలో పూరి గుడిసె దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన పూరి గుడిసె

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం ఎస్సీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఒక పూరి గుడిసె దగ్ధమైంది. వివరాల ప్రకారం స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఇందేటి రాములు, బేబి దంపతులు కూలినాలి చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఇదిలా ఉంటే వారు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్స్ సర్క్యూట్ కారణంగా పూరి గుడిసెకు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. దాంతో వారు ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసి, ప్రాణాలను దక్కించుకున్నారు. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే ఇంట్లో ఉన్న సామాగ్రి, దుస్తులు, రూ.5 వేల నగదు కాలి బూడిదైంది. దీంతో బాధిత కుటుంబం లబోదిబోమంటోంది.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం



వృద్ధులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : జాతీయ వృద్ధుల దినోత్సవం సోమవారం జంగారెడ్డిగూడెం రోడ్డులోని రోటరీ క్లబ్ కల్పవృక్ష వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు ఆధ్వర్యంలో వృద్ధులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గంగిరెడ్ల బాయమ్మ, రాజనందనరావు దంపతుల జ్ఞాపకార్థం కుమార్తె రామలక్ష్మి మధు వృద్ధులకు పౌష్టికాహారం అందజేశారు. కొనకళ్ళ సత్యనారాయణ, జయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు రాంబాబు రూ.35 వేల విలువైన పది స్టీల్ బెంచీలు, ఎల్‌సీడీ టీవీ, కుక్కర్‌ను అందించారు. అలాగే జె.మంగాయమ్మ రూ.10 వేల విలువైన ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ సిస్టం క్లబ్‌కి బహుకరించారు. వృద్ధులను గౌరవించుకోవడం, వారికి ప్రత్యేకంగా ఒక రోజును కేటాయించి వారితో గడపడం సంతోషంగా ఉందని అతిథులు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, చిటికెన నాగార్జున, దూలపల్లి కాంతారావు, క్లబ్బు అధ్యక్ష కార్యదర్శులు విశ్వనాథ శర్మ, గొలిశెట్టి వాసు, ఎస్‌కే అమీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

మానవత శాంతి ర్యాలీ



కొయ్యలగూడెం గణేష్ సెంటర్‌లో విద్యార్థుల మానవహారం

కొయ్యలగూడెం : మానవతా ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆ సంస్థ కొయ్యలగూడెం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. టీటీడీ కళ్యాణ మండపం నుంచి గణేష్ సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు మానవహారం నిర్మించి సంఘీభావం తెలిపారు. ప్రెసిడెంట్ బొమ్మ రామ్మోహన్ మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత ఆశయం అని, ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని అన్నారు. గుండె వ్యాధితో బాధపడుతున్న ముప్పిడి వెంకట్రావుకు రూ.3 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ టి.సిద్ధార్థ, వీఎస్ఎన్ స్వామి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, దిద్దే ఎబినేజర్, మందపాటి రామకృష్ణ, బవిరిశెట్టి నాగేశ్వరరావు, కళాశాల విద్యార్థులు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయండి

కుక్కునూరు : సీపీఐ ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర ఆగస్టు 23వ తేదీన జంగారెడ్డిగూడెం పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా పార్టీ కార్యకర్తలు, వ్యవసాయ కార్మికులు, అన్ని వర్గాల వారు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి కోరారు. సోమవారం కుక్కునూరు మండలం పెద్దరావిగూడెంలో జరిగిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ వ్యవస్థలో మతోన్మాదాన్ని జొప్పించి దుష్ట సాంప్రదాయాలను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. అనేక రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను కొల్లగొట్టి గవర్నర్ ద్వారా తమ పార్టీ ప్రభుత్వాలను అప్రజాస్వామికంగా ఏర్పాటు చేస్తుందని దుయ్యబట్టారు. ఇలాంటి దుర్మార్గమైన పాలకుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో బస్సు యాత్ర ద్వారా ప్రచార జాత నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీపీఐ నాయకులు పల్లెల బిక్షం, సోడె భీమయ్య, సోడె సరోజిని, సోడె వెంకమ్మ,పి అప్పారావు, పుట్టి సుమతి పాల్గొన్నారు

పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని ధరణి ఫుడ్ ఇండస్ట్రీ, ధరణి పికెల్స్ ఎక్స్ పోర్ట్స్ (అమెరికా, ఆస్ట్రేలియా) మేనేజింగ్ డైరెక్టర్ పామర్తి తిరుపతిరావు అన్నారు. స్థానిక సీఆర్ఆర్ కళాశాల సీఐఐఈ, ఈడీసీ, ఎంబీఏ, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తిరుపతిరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న పథకాల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు కూడా లభిస్తాయన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ పరిశ్రమల స్థాపనకు చేయూత అందిస్తున్నారని, దానిని విద్యార్థులు తెలుసుకొని పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపన ద్వారా ఇతరులకు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదుగుతామని, దేశ ఆర్థిక అభివృద్ధిలో భాగస్వాములవుతామని తెలిపారు. శ్రీ ఫ్రూట్ బేవరేజెస్ మేనేజింగ్ డైరెక్టర్ ఫణీందర్ సంపంగి మాట్లాడుతు విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పథకాల ద్వారా స్టార్టప్ పరిశ్రమలు స్థాపించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం పారిశ్రామికవేత్తలను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ కళాశాల డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి, సీఐఐఈ, ఈడీసీ కోఆర్డినేటర్ తేర రాజేష్, ఎంబీఏ డైరెక్టర్ ఆర్ శ్రీనివాసరావు, ఈడీసీ సభ్యులు, అధ్యాపకులు టి.శామ్ ప్రసాద్, ఎం ఉపేంద్ర, పీహెచ్ఎస్ఎస్‌వీ సుబ్బారావు, ఎస్ శ్రీలత, జీఆర్ సత్యనారాయణ, జీవీఎస్ రవీంద్ర బాబు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిడ్‌క్యాప్ ఎండీ అవినీతిపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): ఏపీ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో ఎండీగా పనిచేస్తున్న డోలా శంకర్ అవినీతిపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జి చే సమగ్రవిచారణ చేయించాలని దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. దళిత సేన ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆర్డీఓ పంచల్ కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. దళితసేన నాయకులు పింగుల ఇథియా, బేతాళ జయసుధ, పింగుల విజయమ్మ, నందిపాము శ్యామల, తగరం దేవదాస్, లక్కపాము దాసు, కటారి రాట్నాలమ్మ పాల్గొన్నారు.